జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి సహకరించాలి: టీపీసీసీ



టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన అంబర్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ నేతలు కృష్ణగౌడ్, నాగభూషణం తదితరులు

రాంనగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఇండియా కూటమి తరపున ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా పోటీచేస్తున్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి రాజకీయాలకతీతంగా అన్ని పార్టీలు సహకరించాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ కోరారు. ఇండియా కూటమి అభ్యర్థిగా తెలుగువారైన జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని కాంగ్రెస్ అధిష్టానం ఎంపిక చేయడాన్ని స్వాగతిస్తూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జి.నాగభూషణం, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ ఆధ్వర్యంలో మహేష్‌కుమార్‌గౌడ్‌ను అంబర్‌పేట నియోజకవర్గం నాయకులు కలిసి మద్దతు ప్రకటించారు. తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ పార్టీలు జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని, సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదగిరిగౌడ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

జీవో 137 రద్దు హర్షణీయం :టీజీఎంఎంఎఫ్



బీసీ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న మాదిగ మేధావుల ఫోరం అధ్యక్షుడు ఆరేపల్లి రాజేందర్ తదితరులు

రాంనగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని లిడ్‌క్యాప్ భూముల పరిరక్షణకు ప్రభుత్వం జీవో తీసుకురావడం హర్షణీయం అని తెలంగాణ మాదిగ మేధావుల ఫోరం(టీజీఎంఎంఎఫ్) అధ్యక్షుడు ఆరేపల్లి రాజేందర్ పేర్కొన్నారు. నగరంలోని గచ్చిబౌలిలో లిడ్‌క్యాప్‌కు ఇచ్చిన భూములలో యూనిట్‌మాల్, పెట్రోల్ బంకు ఏర్పాటుకు ఇచ్చిన జీవోను రద్దు చేయాలని మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు మాదిగ మేధావుల ఫోరం, తెలంగాణ రాష్ట్ర చర్మకారుల సంఘాల జేఏసీ ఫిర్యాదు చేశాయి. వారు స్పందించి చీఫ్ సెక్రటరీతో మాట్లాడి ప్రభుత్వం ఇచ్చిన జీవో 137ను రద్దు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఇద్దరు మంత్రులను కలిసి సత్కరించినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరం సలహాదారులు వీరస్వామి, ఉపాధ్యక్షుడు సాయిబాబా, చర్మకారుల సంఘాల జేఏసీ కన్వీనర్ రాజు, కార్యదర్శి దర్శనం, కోశాధికారి జి.సతీష్, రాజ్‌కుమార్, బక్క నర్సింహ, వంశీ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

దాడులు చేసిన మార్వాడీలపై చర్యలు తీసుకోవాలి



ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు వినతిపత్రం ఇస్తున్న మాల సంఘాల జేఏసీ నేతలు

కవాడిగూడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి జిల్లా శివారు ప్రాంతాలలో ప్రధానంగా మాలపై దాడులు చేస్తూ దౌర్జన్యాలకు దిగుతూ కులం పేరుతో దూషిస్తున్న మార్వాడీలపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ మాల సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మందాల భాస్కర్, గ్రేటర్ చైర్మన్ బేర బాలకిషన్ డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులపై దాడులు చేస్తున్న మార్వాడీలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాల సంఘాలు చేసిన నాయకులు డాక్టర్ వీరస్వామి, కొప్పుల అర్జున్, గోపి, సత్యనారాయణ, అరుణ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో డీబీపీ పోటీ

బర్కత్‌పుర, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో దళిత బహుజన పార్టీ పోటీ చేస్తుందని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ వెల్లడించారు. ప్రజాసమస్యలను పట్టించుకోవడంలో అధికార ప్రతిపక్ష పార్టీలు పూర్తిగా వైఫల్యం చెందాయని ఆరోపించారు. గురువారం నారాయణగూడలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీలు, 5,817 ఎంపీటీసీలు, 539 జెడ్‌పీటీసీ స్థానాలకు తమ పార్టీ పోటీ చేస్తుందన్నారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో 150 డివిజన్లలో అభ్యర్థులను నిలబెబతామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనారిటీలకు టికెట్లు కేటాయిస్తామన్నారు. ముఖ్యంగా యువతీ, యువకులకు టికెట్ల కేటాయింపులో పూర్తి ప్రాధాన్యం ఇస్తామని, పోటీ చేయాలని ఆసక్తి ఉన్న వారు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

ఏక్‌మినార్ వద్ద కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

ముషీరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ ఏక్‌మినార్ వద్ద కంచెలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వల్ల ప్రమాదాలు తలెత్తే అవకాశాలు ఉన్నాయని భోలక్‌పూర్ మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్ పేర్కొన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫారం చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని గురువారం విద్యుత్ శాఖ ఏఈలు సునీల్‌రెడ్డి, సుధామాలకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వాజీద్ హుస్సేన్ మాట్లాడుతూ... స్థానికంగా గృహనివాసాలు, మసీద్‌కు వచ్చే ప్రజలకు కంచెలేని ట్రాన్స్‌ఫారంతో విద్యుత్ షాక్‌కు గురయ్యే అవకాశాలు ఉన్నాయని ఫిర్యాదు చేశారు. అధికారులు వెంటనే కంచె ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారానికై ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ దృష్టికి సైతం తీసుకెళ్లామని తెలిపారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

బర్కత్‌పుర, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. కింగ్‌కోఠికి చెందిన సయ్యద్ హైదర్ హుస్సేన్(54) అన్నయ్య వద్ద నివాసం ఉంటున్నాడు. అతనికి వివాహం కాలేదు. మానసిక ప్రవర్తన సరిగ్గా ఉండదు. గురువారం ఉదయం డబీర్‌పుర-మలక్‌పేట రైల్వే స్టేషన్ల నడుమ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. జేబులో సూసైడ్ నోట్ లభించింది. తన చావుకు ఎవరూ కారణం కాదని, జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంటున్నానని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నట్లు సీఐ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వీధికుక్క దాడిలో వ్యక్తికి తీవ్రగాయాలు

బర్కత్‌పుర, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వీధికుక్క దాడిలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ మేరకు ఆయనకు నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో చికిత్స అందించారు. వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేటకు చెందిన పెంటయ్య బుధవారం రాత్రి తన ఇంటి వద్ద వీధిలో నడుచుకుంటూ వెళ్తుండగా.. ఓ వీధి కుక్క అతడిపై దాడి చేసింది. ఈ ఘటనలో ఆయన ఎడమ కాలి పిక్క కింద లోతైన గాయమైంది. కుటుంబ సభ్యులు స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం వైద్యుల సూచనమేరకు నల్లకుంట ఫీవర్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆయన కాలికున్న గాయాన్ని శుభ్రం చేసి, టీటీ, ఏఆర్‌వీ, రిగ్ ఇంజక్షన్లు ఇచ్చి, చికిత్స అందించారు. కాలిన గాయం తీవ్రంగా ఉండడంతో గాంధీ లేక ఉస్మానియా ఆస్పత్రికి వెళ్లాలని వైద్యులు సూచించారు.

సమన్వయంతో

మండపాల నిర్వాహకులకు కార్పొరేటర్లు, వివిధ విభాగాల ఉన్నతాధికారుల సూచన

గణేశ్ ఉత్సవాలను నిర్వహించాలి

గణేశ్ ఉత్సవాలను ప్రభుత్వ అన్ని విభాగాల అధికారులు, మండపాల నిర్వాహకులు సమన్వయంతో ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని కార్పొరేటర్లు, ఉన్నతాధికారులు సూచించారు. ప్రమాదకర విద్యుత్ తీగలను తక్షణమే తొలగించాలని, గణేశ్ విగ్రహాల తరలింపులో కరెంట్‌ను తీసేయాలని వివరించారు. ఈ మేరకు గురువారం నల్లకుంట, ముషీరాబాద్, రాంనగర్, అంబర్‌పేట, కవాడిగూడ డివిజన్లలో సమావేశాలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో గురువారం జరిగిన కార్యక్రమాల్లో కార్పొరేట్లు బి.పద్మావెంకటరెడ్డి, సుప్రియా నవీన్‌గౌడ్, విజయ్‌కుమార్ గౌడ్, యాకర అమృత పాల్గొన్నారు.



ఏడీ శీనయ్య, ఏఈ నాగరాజుతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పద్మ

నల్లకుంట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): త్వరలో గణేష్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు, స్తంభాలను గుర్తించి తక్షణమే చర్యలు తీసుకోవాలని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. గురువారం విద్యుత్ శాఖ ఏడీ శీనయ్య, ఏఈ నాగరాజుతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రామంతాపూర్, బాగ్‌అంబర్‌పేట ప్రాంతాల్లో జరిగిన విద్యుత్ ప్రమాదంలో పలువురు ప్రాణనష్టం పట్ల తీవ్రవిచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని శాఖల అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బాగ్‌అంబర్‌పేట విద్యుత్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన రాంచరణ్ కుటుంబానికి రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మిరియాల శ్రీనివాస్, జమ్మిచెట్టి బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్

ముషీరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ త్వరలో జరిగే వినాయక ఉత్సవాలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ కోరారు. గురువారం ముషీరాబాద్ వార్డు కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ, జలమండలి, పోలీస్, విద్యుత్ శాఖ అధికారులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... వినాయక మండపాల వద్ద డ్రైనేజీ, మురుగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. మండపాల వద్ద ప్యాచ్‌వర్క్ రోడ్డు పనులు చేపట్టాలని విజ్ఞప్తిచేశారు. వెలగని వీధిదీపాలకు మరమత్తులు చేయాలన్నారు. రోడ్డుపై అడ్డంగా వేళాడుతూ ఉన్న కేబుల్ తీగల వల్ల సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయని, వాటిని సరిచేయాలని పేర్కొన్నారు. ఏపుగా పెరిగిన చెట్లకొమ్మలను తొలగించి, వినాయక నిమజ్జన సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాపూజీ నగర్‌లో రోడ్డుపైనే పార్కు చేస్తున్న చెత్తరిక్షాలను, ఎదురుగా ఉన్న వీధిలో ఏర్పాటు చేసేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ అన్నిశాఖల అధికారులతో కలిసి వాట్స్ గ్రూప్ ఏర్పాటు చేస్తున్నామని, మీ దృష్టికి వచ్చిన సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని విజ్ఞప్తిచేశారు. ఈ సమావేశంలో బీజేపీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, నాయకులు మెట్టు వాసు, అనిల్ కుమార్, సత్యనారాయణ, లక్ష్మణ్, జీహెచ్‌ఎంసీ సర్కిల్-15 డీఎంసీ రామానుజులరెడ్డి, ఏఎంవోహెచ్ డాక్టర్ ప్రవీణ, విద్యుత్ శాఖ డీఈ అశోక్, ఏఈలు సునీల్‌రెడ్డి, సుదామా, ఎస్సైలు రాజేష్‌రాంచంద్రారెడ్డి, జలమండలి సెక్షన్ మేనేజర్‌లు సురేష్, శివసాయి, తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవ సమితి కన్వీనర్‌గా దయాకర్‌యాదవ్



అంబర్‌పేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి అంబర్‌పేట డివిజన్ కన్వీనర్‌గా దయాకర్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు సమితి నగర నేత జి.ఆనంద్‌గౌడ్ ఆయనకు గురువారం నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి నాయకులు మైలారం రాజు, చుక్క జగన్, వెంకటస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమావేశం



ఈస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బాలస్వామికి ఆహ్వాన పత్రం అందజేస్తున్న సమితి ప్రతినిధులు

రాంనగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ గణేష్ ఉత్సవ అంబర్‌పేట నియోజకవర్గం ఆధ్వర్యంలో ఈనెల 23న అశోకా ఫంక్షన్ హాల్‌లో గణేశ్ మండప నిర్వాహకుల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు సమితి నియోజకవర్గం కన్వీనర్ అచ్చిని రమేష్ తెలిపారు. ఈ సమావేశానికి ఈస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బాలస్వామి, అడిషనల్ డీసీపీ జోగుల నర్సయ్య, అంబర్‌పేట పీఎస్ సీఐ కిరణ్‌ను గురువారం ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవసమితి ప్రతినిధులు జి.ఆనంద్‌గౌడ్, పి.గోవర్ధన్‌రెడ్డి, చుక్క జగన్, ఎస్.నర్సింగ్‌రావు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ విగ్రహాల తరలింపులో జాగ్రత్త



మాట్లాడుతున్న కార్పొరేటర్ యాకర అమృత

నల్లకుంట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గణేష్ విగ్రహాల తరలింపు, మండపాల నిర్వహణపై నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని నల్లకుంట కార్పొరేటర్ యాకర అమృత పేర్కొన్నారు. గురువారం నల్లకుంట డివిజన్ అభివృద్ధి కార్యాలయంలో ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాలతో జరిగిన శ్రీకృష్ణాష్టమి వేడుకల సందర్భంగా, గణేష్ విగ్రహ తరలింపు సమయంలో విద్యుత్ షాక్‌కు గురై పలువురు మరణించిన విషయంలో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు గణేష్ విగ్రహాల తరలింపు విషయంలో మండప నిర్వాహకులతో పాటు ట్రాఫిక్, ట్రాన్స్‌కో, జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ సరఫరాను నిలిపివేయాలని అధికారులకు సూచించారు. మండపాల సమయంలో విద్యుత్ సంబంధిత పనులు చేసే సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని నిర్వాహకులకు సూచించారు. గోతులమయమైన రోడ్లు లేకుండా, చెట్ల కొమ్మలను తరలించడం, విగ్రహం తరలిస్తున్న సమయంలో ట్రాఫిక్ వంటి విషయాలపై అధికారులు, పోలీసులు ప్రత్యేకశ్రద్ధ వహించాలని పేర్కొన్నారు.

స్థానికుల సమస్యలను పరిష్కరించాలి



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్‌లో స్థానికుల సమస్యలను అధికారులు పరిష్కరించాలని కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్ అన్నారు. గురువారం డివిజన్‌లోని పటేల్‌నగర్, ప్రేమ్‌నగర్‌లో ఆయన పాదయాత్ర నిర్వహించి బస్తీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కలుషిత నీరు, గణేష్ మండపాల వద్ద విద్యుత్ సమస్యలను అధికారులు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ శ్రీకాంత్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గణేశ్ మండప నిర్వాహకులు పోలీసులకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ ఏ.యాదగిరి

కవాడిగూడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకునే విధంగా మండప నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని గాంధీనగర్ సబ్ డివిజన్ ఏసీపీ ఎ.యాదగిరి సూచించారు. గురువారం గాంధీనగర్ పీఎస్ సీఐ బోస్ కిరణ్ ఆధ్వర్యంలో పీఎస్ పరిధిలోని గణేశ్ మండప నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీనగర్ పీఎస్ పరిధిలో గణేశ్ మండపాల నిర్వాహకులు తప్పనిసరిగ్గా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వర్షాకాలం కాబట్టి వినాయక మండపం ఏర్పాటు చేసే సమయంలో, విగ్రహాన్ని తీసుకొచ్చే సమయంలో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఎస్ ఎస్ఐలు నరసింహ, హరీష్, గాంధీనగర్ పీఎస్ పరిధిలోని గణేశ్ మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

రత్నానగర్ రిటర్నింగ్ వాల్ నిర్మాణాన్ని పూర్తిచేయాలి

ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



రత్నానగర్‌లో నిలిచిన రిటర్నింగ్‌వాల్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, అధికారులు తదితరులు

నల్లకుంట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): హుస్సేన్‌సాగర్ నాలా పరీవాహక ప్రాంతాలైన నల్లకుంట డివిజన్‌లోని రత్నానగర్‌లో రిటర్నింగ్ వాల్ నిర్మాణ పనులు వెంటనే పూర్తిచేయాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులను ఆదేశించారు. గురువారం ఎమ్మెల్యే అధికారులతో కలిసి రత్నానగర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రత్నానగర్ బస్తీలోకి వర్షపునీరు రావడంతో ప్రజలు ఇబ్బందులకు గురువుతున్నారని అన్నారు. దీంతో వెంటనే హుస్సేన్‌సాగర్ నాలా పరీవాహక ప్రాంతమైన రత్నానగర్ రిటర్నింగ్ వాల్ పనులు వెనువెంటనే పూర్తిచేయాలని అధికారులకు ఆదేశించారు. బస్తీప్రజలు ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే నేరుగా ఎమ్మెల్యే కార్యాలయంలో తమను సంప్రదించాలన్నారు. కురుస్తున్న భారీ వర్షాలమేరకు ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలను గుర్తించాలని ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. ప్రజలు కూడా వర్షాకాలంలో విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ, హైడ్రా, రెవెన్యూశాఖ అధికారులు, బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు, బస్తీవాసులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్ మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే బండారి

రామంతాపూర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రామంతాపూర్ విద్యుత్ షాక్ ఘటనలో మృతి చెందిన కాటేపల్లి శ్రీకాంత్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, రుద్ర వికాస్, పింజర్ల కృష్ణ యాదవ్, చిట్టబోయిన సురేష్‌యాదవ్‌ల కుటుంబ సభ్యులను గురువారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలకు కోటి రూపాయల నగదు, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఇదే విషయాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు కు తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. క్షత గాత్రులకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించి ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కైలాష్ పతి గౌడ్, కాంగ్రెస్ నాయకుడు మోహన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కంపెనీలో ప్రమాదవశాత్తు కార్మికుడి మృతి

ఉప్పల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఉప్పల్ పారిశ్రామిక వాడలో జరిగిన ప్రమాదంలో కార్మికుడు మృతి చెందిన సంఘటన గురువారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఉప్పల్ అంబేద్కర్‌లో నివాసముండే గుగులోత్ అచ్చన్న (54) తాత్కాలిక ఉద్యోగిగా పని చేస్తున్నాడు. గురువారం కంపెనీలో విధులు నిర్వర్తిస్తుండగా ఎత్తైన ప్రదేశం నుంచి కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న ఉప్పల్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అదే కంపెనీలో అచ్చన్న కుమారుడు కూడా పని చేస్తున్నాడు. మృతుడి కుటుంబానికి కంపెనీ యాజమాన్యం నష్ట పరిహారం ఇచ్చేందుకు అంగీకరించినప్పటికి బంధువులు తగినంత నష్ట పరిహారం కోసం డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారడు ఉన్నాడని, కుమార్తెల వివాహం జరిపించేందుకు కావాల్సిన నష్టపరిహారం ప్రకటించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దత్తత తీసుకున్న పెద్దక్క ఆస్తిలో వాటా ఇప్పించాలి

● మేనకోడలి నుంచి రక్షణ కల్పించాలి ● రాష్ట్ర ప్రభుత్వానికి బాధితుడి విన్నపం



మాట్లాడుతున్న దరువూరి హనుమంతరావు, ఉమారాణి తదితరులు

నల్లకుంట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మేనకోడలి నుంచి తనకు రక్షణ కల్పించి, దత్తత తీసుకున్న పెద్ద అక్క ఆస్తిలో వాటాను తనకు ఇప్పించాలని ఓ బాధితుడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాడు. గుంటూరు పండరీపురం 1వ వీధి ఇంటి నెంబర్ 5-72-6లో నివాసం ఉండే దరువూరి హనుమంతరావు నగరానికి వచ్చి అద్దె ఇంట్లో ఉంటున్నాడు. గుంటూరు చెందిన పెద్దక్క కంజుల వెంకాయమ్మ తనను చిన్నప్పుడు దత్తత తీసుకుందని, తనతోపాటు చిన్నఅక్క కుమార్తెను దత్తత తీసుకుందని తెలిపారు. అయితే నగరానికి వచ్చి స్థిరపడ్డ తనకు అక్కకు చెందిన ఆస్తిలో వాటా ఇయ్యకుండా మా మేనకోడలు నాగరాజకుమారి ఇబ్బందులకు గురిచేస్తుందని వాపోయారు. గురువారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటుచేసిన విలేకరులతో సమావేశంలో ఆయన సతీమణి దరువూరి ఉమారాణితో కలిసి మాట్లాడారు. తన పెద్దక్కకు చెందిన ఆస్తిని తనకు, మేనకోడలుకు సమానంగా పంచి ఇచ్చిందన్నారు. అయితే మేనకోడలు మా అక్కను బురిడీ కొట్టించి, ఆస్తిమొత్తం తన పేరుపై గిఫ్ట్‌డీడీ చేయించుకుందని ఆరోపించారు. తనకు ఆస్తిలో వాటా ఇవ్వాలని మేనకోడలిని అడిగితే బెదిరింపులకు గురిచేస్తుందని, ఆమె నుంచి తనకు ప్రాణహాని ఉందని వాపోయారు. తనకు ఆరోగ్యం సరిగ్గా లేదని, కోర్టుకు కూడా వెళ్లలేని స్థితిలో ఉన్నానని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తనకు వచ్చే వాటాను ఇప్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇబ్బందులకు గురిచేస్తున్న మేనకోడలిపై తగు చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రామాచారి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌వీఎన్ వాసులకు 2బీహెచ్‌కే ఇళ్లను కేటాయించాలి

చిక్కడపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లోని స్వామివివేకానందనగర్ బస్తీలో ఏడాదిన్నర కిందట కూల్చివేసిన ఇళ్లకు సంబంధించిన బాధితులకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపును పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ గురువారం కలెక్టర్ హరిచందనకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గతేడాది జనవరిలో 19 దళితుల ఇళ్లను రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది కూల్చివేశారని వారికి డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డా.లక్ష్మణ్, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ లిఖితపూర్వకంగా కలెక్టర్‌కు లేఖలురాశారని గుర్తుచేశారు. ఇళ్ల కేటాయింపులో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, బస్తీవాసులు ఎంబీకృష్ణ, జ్ఞానేశ్వర్, ఆనంద్‌రావు తదిరతులు పాల్గొన్నారు.

కామేశ్వరి బహుముఖ ప్రతిభాశాలి



కామేశ్వరికి పురస్కారాన్ని బహూకరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

చిక్కడపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కామేశ్వరి బహుముఖ ప్రతిభాశాలి అని ప్రభుత్వ మాజీ సలహాదారు డా.కేవీ.రమణాచారి అన్నారు. సాంస్కృతిక సంస్థ అభినందన ఆధ్వర్యంలో మాతృవందనం వేడుకలు త్యాగరాయగానసభలో గురువారం రాత్రి జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన రమణాచారి రచయిత్రి డి.కామేశ్వరికి మాదిరాజు వరలక్ష్మి పురస్కారం, రామలక్ష్మి రంగాచార్యులుకు మాతృవందనం పురస్కారాన్ని ప్రదానం చేసి సన్మానించారు. దూరదర్శన్ పూర్వ సంచాలకుడు పి.మధుసూదనరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో హైమవతీభీమన్న, జీవీఎస్.రాజు, కేవీ.కృష్ణకుమారి, లలితారావు, ఇ.భవాని తదితరులు పాల్గొన్నారు.

మూసీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

హత్యగా అనుమానం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న అంబర్‌పేట సీఐ కిరణ్‌కుమార్

అంబర్‌పేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట పీఎస్ పరిధిలోని మూసీ పరీవాహక ప్రాంతంలో గురువారం ఓ గుర్తుతెలియని మృతదేహం లభించింది. అంబర్‌పేట డంపింగ్ యార్డు సమీపంలో ప్రవహిస్తున్న మూసీ లోతట్టు ప్రాంతంలో గుర్తుతెలియని శవం ఉండడాన్ని స్థానికులు గమనించి అంబర్‌పేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ జోగుల నర్సయ్య, కాచిగూడ ఏసీపీ హరీష్‌కుమార్, అంబర్‌పేట సీఐ కిరణ్‌కుమార్, సెక్టార్ ఎస్ఐ తరుణ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం గొంతుకు కేబుల్ వైరు చుట్టి ఉండడంతో ఇది హత్యగా పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహం కుళ్లిపోకుండా ఉండడంతో సంఘటన ఒకటి, రెండు రోజుల క్రితమే జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై అంబర్‌పేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.